క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పాదయాత్ర

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సోమవారం ఉదయం 8.30 గంటలకు ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1లోని హనుమాన్ ఆలయం నుంచి ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ పాదయాత్ర చేపట్టనున్నట్లు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి



పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మెడల్ అందిస్తున్న మల్లికార్జునయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని ఓల్డ్ బోయిన్‌పల్లి బీఆర్‌ఎస్ యువ నాయకుడు మల్లికార్జునయాదవ్ అన్నారు. ఆదివారం ఎంకేఆర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సెకండ్ ఇంటర్ స్కూల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ టి. నర్సింహ, శ్రీనివాస్, యాదగిరి, రాజుయాదవ్, మల్లేష్‌యాదవ్, బుర్రి యాదగిరి, మేకల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి తాగునీటి సరఫరా నిలిపివేత

కూకట్‌పల్లి: గోదావరి డ్రింకింగ్ వాటర్ పైపులైన్ల మరమ్మతు పనుల కారణంగా ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు జలమండలి కూకట్‌పల్లి డీజీఎం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారు ముందుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

బెల్ట్ టెస్ట్ పోటీలు



సర్టిఫికెట్లతో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

మోతీనగర్: రాజీవ్‌నగర్‌లో కుంగ్‌ఫూ దు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ బెల్ట్ టెస్టు పోటీలు ఆదివారం జరిగాయి. బెల్ట్ టెస్టులో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు గ్రాండ్ మాస్టర్ కంటేశ్వర్ బెల్టులను ప్రదానం చేశారు. అసిస్టెంట్ గ్రాండ్ మాస్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ రోజుల్లో మహిళలు ఆత్మ రక్షణకు సంబంధించి మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఉపయోగకరమన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే మార్షల్ ఆర్ట్స్ ముఖ్యమని తెలిపారు. గాయత్రినగర్, రాజీవ్‌నగర్‌లో ఉదయం, పీఆర్‌నగర్‌లో సాయంత్రం వేళల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు.

నేడు ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

కూకట్‌పల్లి: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం ఉదయం 11గంటలకు కూకట్‌పల్లి పీఎస్‌ఎం స్కూల్ ఆవరణలో ఉదయం 11గంటలకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజు అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర పదాధికారులు, వివిధ సెల్స్ కన్వీనర్, కోకన్వీనర్‌లు, కార్యవర్గసభ్యులు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ హాజరు కానున్నట్లు తెలిపారు.

చెరువులో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

భాగ్యనగర్‌కాలనీ: గుర్తు తెలియని వ్యక్తి చెరువులో శవమై తేలిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఓ వ్యక్తి (35ఏళ్లు) చెరువులో శవమై తేలి ఉండటంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి చూడగా మృతుడు రెండు రోజుల క్రితమే చెరువులో పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవటంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

పనుల్లో వేగం పెంచాలి

మియాపూర్ : అభివృద్ధి పనులను నిర్ణీత సమయానికి పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని సత్యనారాయణ ఎన్‌క్లేవ్ కాలనీలో రూ. 172.25 లక్షల వ్యయంతో చేపట్టిన నాలా విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు.

గత ప్రభుత్వాల.. అభివృద్ధి శూన్యం



సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- దశాబ్ద కాలంలోనే కూకట్‌పల్లిలో ఎంతో అభివృద్ధి
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సంక్షేమ పథకాలు శూన్యం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కేపీహెచ్‌బీ డివిజన్‌లో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు తదితరులు

కూకట్‌పల్లి: గత ప్రభుత్వాల హయంలో కూకట్‌పల్లి నియోజకవర్గం ఏ విధంగా ఉండేదో తాను ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ఎంత అభివృద్ధిలో దూసుకెళ్తుందో ప్రజలే గుర్తించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం కేపీహెచ్‌బీ కాలనీ, అల్లాపూర్ డివిజన్‌లలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సబిహా బేగంల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ముందు ఉన్నామని తెలిపారు. అల్లాపూర్ డివిజన్‌లో మంచి నీరు, రోడ్లు, విద్యుత్ లేక అల్లాడిపోయేవారని కానీ నేడు ఆ పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు అల్లాపూర్ అభివృద్ధికి మారుపేరుగా ఉందన్నారు.

◆ అదే విధంగా కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రజలకు అందించిన మౌలిక సదుపాయాలు మాత్రమే కాకుండా వేల కోట్ల రూపాయలతో ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం, ప్రత్యేక మహిళా పార్కులు, ఓపెన్ జిమ్‌లు, దేవాలయాలు, ఇండోర్ స్టేడియాలు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ప్రతిపక్ష పార్టీలకు ఇవన్నీ కనబడటం లేదన్నారు.

◆ బీజేపీ విద్వేషాలు రెచ్చగొట్టి అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉన్నవారిని విడగొట్టే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత మనపై ఉందన్నారు. బూత్‌స్థాయిలో ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.

◆ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ల పేరుతో 1 లక్ష 116 రూపాయలతో పాటు ఫించన్‌దారులకు 2 వేల నుంచి 3 వేల రూపాయల వరకు అందజేస్తూ దేశంలోనే ఏ ప్రభుత్వం చేపట్టని సంక్షేమ పథకాలను తమ నాయకుడు కేసీఆర్ అమలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 500 రూపాయల పెన్షన్ కూడా అందించడం లేదన్నారు.

◆ బీజేపీ నాయకులు మాయమాటలు చెప్పి రాష్ట్ర ప్రజలను అభాసుపాలు చేసేందుకు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో బయటి నుంచే వచ్చే వ్యక్తుల మాటలు విని మోసపోతే ఈ ప్రాంత ప్రజలే నష్టాలపాలవ్వాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఐలయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి ...

కేపీహెచ్‌బీ డివిజన్ బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో బీజేపీ నుంచి పలువురు సీనియర్ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీజేపీ నాయకులు కావలి కోదండ రామయ్య, మహిళా నాయకులు వెంకటేశ్వరమ్మ, రజిత, మాధవి, ధనలక్ష్మీ, నాగమణిలు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి చూసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరామని, ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని పనులు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నాయకత్వంలో జరిగాయని మరింత అభివృద్ధి దిశగా తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచేందుకు మా వంతు సహకారం అందిస్తామని అన్నారు.

ఎప్పటికీ సజీవంగా ఉండేది పద్యమే...



సాహిత్య సభను ప్రారంభిస్తున్న ప్రముఖులు



పద్యాల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

మోతీనగర్: మోతీనగర్ కో-ఆపరేటివ్ హైసింగ్‌సొసైటీ కమ్యూనిటీహాలులో ఆదివారం సాహిత్య సభ నిర్వహించారు. ఈ సభలో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడుతూ.. తెలుగు సాహిత్య ప్రక్రియలో ఎప్పటికీ సజీవంగా ఉండేది పద్యమే అని నన్నయ్య మొదలుకొని శ్రీనాథుడు, వేమన వంటి ఎందరో కవులు తెలుగు పద్యానికి పట్టాభిషేకం చేశారని పేర్కొన్నారు. నవసాహితి ఇంటర్నేషనల్ (చెన్నై) ఆధ్వర్యంలో «ఆహా ఏమి పద్యంౕయూ ట్యూబ్ చానల్‌ను ప్రారంభించిన సందర్భంగా పద్యాల పోటీ నిర్వహించారు. అనేక ప్రాంతాల నుంచి పలువురు బాలలు ఈ పోటీలో పాల్గొన్నారు. విశాఖపట్నంకు చెందిన వడలి వెంకట అనంతరామ్ స్థాపించిన ఈ చానల్‌ను ప్రముఖ పాత్రికేయులు కొప్పరపు కవుల కళాపీఠం వ్యవస్థాపకులు శర్మ ఆవిష్కరించి పద్యం ప్రాసస్త్యాన్ని వివరించారు.

◆ ప్రముఖ సంగీతకారులు, స్వరకర్త వీణాపాణి ఒక సుదీర్ఘ పద్యాన్ని ఏకదాటిగా చదివి పిల్లలందరూ పద్యాల పట్ల ఆసక్తి పెంచుకోవాలని కోరారు. బహుభాష పండితుడు డాక్టర్ కావూరి శ్రీనివాసశర్మ శ్రీనాదుని పద్యవైభవాన్ని వివరించారు. మరో బహుభాషవేత్త ఎన్వీ అనంత కృష్ణస్వీయ పద్యాలు చదివారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితివేత్తలు పుచ్చా శ్రీరామమూర్తి వేల్పుచర్ల సుబ్బరామరావు, బిజుమళ్ల నాగేశ్వరరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. శిరీష బుర్రా వ్యాఖ్యానం, అంజిరెడ్డి స్వాగతోపన్యాసంతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న నతానియేలు

పంజగుట్ట: భావిభారత నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రొఫెసర్ నతానియేలు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. ఉపాధ్యాయ రంగాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, ఒక్క యూనివర్సిటీలోనూ అధ్యాపక పోస్టులు భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సారి ఎమ్మెల్సీలు ఎన్నికవుతారు కానీ ఎవరూ ప్రశ్నించరన్నారు. తాను పోరాడి విద్యావ్యవస్థను పటిష్టం చేస్తానన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో సీరియల్ నెంబర్ 16కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో పల్లెల వీరయ్య, ఎమ్.డీ మగ్దుల్ అలీ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

ఖైరతాబాద్: హైదరాబాద్ నగర పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న షీ టీమ్స్ 5కె, 2.5కె రన్‌ల నేపథ్యంలో ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు, ట్రాఫిక్ మళ్లింపులు విధిస్తున్నట్లు ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. షీ టీమ్స్ రన్ నేపథ్యంలో ఖైరతాబాద్ చౌరస్తా నుంచి ఖైరతాబాద్ ఫ్లై ఓవర్, నెక్లెస్ రోడ్డు రోటరీ వైపు వచ్చే వాహనాలను ఖైరతాబాద్ చౌరస్తా నుంచి నిరంకారి భవన్ వైపు మళ్లిస్తారు, తెలుగుతల్లి చౌరస్తా నుంచి ఎన్టీఆర్ మార్గ్ వైపు వచ్చే వాహనాలకు అనుమతి ఉండదు. ఆ వాహనాలను ఎక్బాల్ మినార్ వైపునకు మళ్లిస్తారు. తెలుగుతల్లి చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే వాహనాలను తెలుగుతల్లి ఫ్లై ఓవర్ మీదుగా అనుమతిస్తారు. లిబర్టీ నుంచి అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వెళ్లే వాహనాలను అంబేడ్కర్ విగ్రహం నుంచి తెలుగుతల్లి చౌరస్తా మీదుగా ఎక్బాల్ మినార్ వైపు మళ్లిస్తారు. కర్బలా మైదాన్ నుంచి అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వచ్చే ట్రాఫిక్ చిల్డ్రన్స్ పార్క్ వద్ద నుంచి బీడీఆర్ మిల్స్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. కవాడిగూడ ఎక్స్‌రోడ్ నుంచి వచ్చే ట్రాఫిక్‌కు సెయిలింగ్ క్లబ్ వైపు అనుమతి లేదు. మినిస్టర్ రోడ్, రాణిగంజ్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను నెక్లెస్ రోడ్డు వైపు అనుతించరు. ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని కోరారు.

'సభ్యుల ఇష్టం మేరకే సొసైటీ నడుచుకుంటుంది'



మాట్లాడుతున్న హెచ్‌ఎంటీ జనరల్ మేనేజర్, ప్రెసిడెంట్ నరేష్ గురుదాసని

భాగ్యనగర్‌కాలనీ: హెచ్‌ఎంటీ ఎంప్లాయిస్, కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ జనరల్ బాడీ సమావేశాన్ని ఆదివారం హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశానికి హెచ్‌ఎంటీ జనరల్ మేనేజర్, ప్రెసిడెంట్ నరేష్ గురుదాసని ముఖ్యఅతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంస్థ పురోగతి తన హయాంలో జరిగిన అభివృద్ధి గురించి సభ్యులకు వివరించారు. సభ్యులు ఇచ్చిన వినతులను స్వీకరించి వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికి నగరంలో 5 వెంచర్లు పూర్తి అయ్యాయని 6వ వెంచర్ కోసం ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. వీలైనంత త్వరలో సభ్యుల ఇష్టం మేరకే సొసైటీ నడుచుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పండరి, ట్రెజరర్, హెచ్‌ఎంటీ జనరల్ మేనేజర్ అలోక్ కుమార్ బహెరా, హెచ్‌ఎంటీ పూర్వ నాయకులు వెంకన్న, కృష్ణమూర్తి, దుర్గప్రసాద్, మాధవాచారి, సభ్యులు గాంధీ, మూర్తి, గోపిచంద్, ఎస్‌వీఎస్‌ఎన్ రాజు, హనుమంతరాజు, రాజిరెడ్డి, అండె నరసింహ, చిప్ప అనంతరరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్‌గ్యాలరీలో అవార్డుల ప్రదానం

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో విజయ్‌ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులకు నిర్వహించిన కార్టూన్, పెయింటింగ్, ఎస్సే రైటింగ్ పోటీల్లో విజేతలకు ఆదివారం అవార్డులను అందజేశారు. కార్టూన్-52, పెయింటింగ్-138, ఎస్సే రైటింగ్-102 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సింగర్ సురేఖ మాట్లాడారు. నిర్వాహకుడు విజయ్ కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అత్యాధునిక పీఎఫ్‌టీ ల్యాబ్ ప్రారంభం

మాదాపూర్: దక్షిణ భారతదేశంలోనే అత్యాధునిక పల్మనరీ ఫంక్షన్ టెస్టింగ్ (పీఎఫ్‌టీ) ల్యాబ్‌ను మాదాపూర్‌లోని యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ హైటెక్‌సిటీలో ఆదివారం ప్రారంభించారు.కాగా మాదాపూర్ ఆస్పత్రిలో ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్షలపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు ముగిసింది.ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన 500 మంది పల్మనాలజీ నిపుణులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య ప్రదర్శన



శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కూచిపూడి కళాకారిణి ప్రవాస భారతీయురాలు శార్వరి.. గజవదన బేడువే, రుక్మిణి ప్రవేశ దరువు, గోవర్ధన గిరిధర, వినాయకకౌతం, దశావతారం తదితర అంశాలను ప్రదర్శించింది. కళాకారులు షణ్ముఖి, కీసర, త్రిపుర సాయి, శ్రీశారనీ, కనిష్క, హిమబిందు, రితిక, నిహారికలు పాల్గొన్నారు.

- మాదాపూర్

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

మెడల్ ప్రైడ్ మెగా సైక్లింగ్ ఈవెంట్‌లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



సైక్లింగ్ ఈవెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష ఆధ్వర్యంలో తులసీవనం వద్ద మెడల్ ప్రైడ్ మెగా సైక్లింగ్ ఈవెంట్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌లు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ ఒక గంట సేపైనా వ్యాయామం అలవర్చుకోవాలన్నారు. అందులో భాగంగానే సైక్లింగ్, యోగా, వాకింగ్ వంటి అలవాట్లతో శారీరకంగా ఎంతో ఆహ్లాదాన్ని కలుగజేస్తాయన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా నేటి పోటీ ప్రపంచంలో పురుషులకు సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ స్థానిక నాయకులు సమ్మారెడ్డి, జిల్లా గణేష్, కాశీనాద్ యాదవ్, పోశెట్టిగౌడ్, రాములుగౌడ్, షౌకత్ ఆలీ మున్నా, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మూసాపేట: అనఘా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ కేర్‌వుడ్ హైస్కూలు 16వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సినిమా, దేశభక్తి గీతాలు, నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కూకట్‌పల్లి ఎంఈఓ ఆంజనేయులు, బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీష, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుల్లోనే కాకుండా క్రీడ, ఆటపాటలు, దైవభక్తి, దేశభక్తి, తోటి వారితో ఏ విధంగా ఉండాలనే విషయాన్ని అర్థమయ్యే విధంగా నేర్పిస్తూ విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని కేర్‌వుడ్ స్కూల్ యాజమాన్యం అందిస్తోందని యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ హరినాథ్, శంకర్‌నాయక్, మున్నా, ఖైలా, శ్రీకాంత్, భాస్కర్‌రావు, సుశీల్, శారద తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు సంఘటితం కావాలి



మాట్లాడుతున్న చెరుకు రాంచందర్

ఖైరతాబాద్: మాలలు తమ హక్కులను సాధించుకునేందుకు సంఘటితం కావాలని మాల సంఘాల జేఏసీ అధ్యక్షులు చెరుకు రాంచందర్ అన్నారు. ఆదివారం ఖైరతాబాద్‌లోని అంబేడ్కర్ స్ఫూర్తి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా మాలలు ముందుకు సాగాలన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. రిజర్వేషన్లు పెంచారని, ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. భూమి లేని నిరుపేదలైన మాలలకు ప్రభుత్వం స్థలం ఇవ్వాలని, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూంలు కేటాయించాలన్నారు. హైదరాబాద్ నగరంలో మాలలకు ఐదెకరాల భూమిని కేటాయించి, ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించాలన్నారు. సమావేశంలో నాయకులు అనంతరామ్, బాలకృష్ణ, రవి, వెంకటేశ్వర్లు, నరసింహ, సుబ్బరాయుడు, హస్సన్, రాములు, కిషన్, కుమార్, కనకరాజు, భాస్కర్ పాల్గొన్నారు.

సంప్రదాయ ఆహార పద్ధతుల వైపు ప్రజలు

- ప్రముఖ ఆధ్యాత్మికవేత్త దేవిశ్రీ గురూజీ
- కంచు పాత్రల్లో భోజనం
- 'బెస్ట్ వింటేజ్ కేటరర్స్'ఆలోచన అభినందయనీయం





బెస్ట్ వింటేజ్ కేటరర్స్‌ను ప్రారంభించి, కంచు పాత్రల్లో తయారు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న దేవిశ్రీ గురూజీ, వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: సంప్రదాయ ఆహార పద్ధతుల వైపు నగరవాసులు మొగ్గు చూపుతుండటం ఆనందంగా ఉందని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త దేవిశ్రీ గురూజీ అన్నారు. ఆదివారం కూకట్‌పల్లిలోని వెంకట్రావ్ నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 'బెస్ట్ వింటేజ్ కేటరర్స్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ.. కరోనాకు ముందు చాలా మంది ఆహారం విషయంలో పెద్దగా జాగ్రత్తలు తీసుకునేవారు కాదని.. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఆహారం విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారని అన్నారు. ఏది పడితే అది తినడం లేదని ఎన్నో రకాలుగా దాని గురించి పలువరితో చర్చించిన తర్వాతనే తింటున్నారని పేర్కొన్నారు.

◆ మన పూర్వీకులు కంచు పాత్రలు, మట్టి పాత్రల్లో వంట చేసేవారని క్రమక్రమంగా నగరవాసులు ఆ విధానానికి కూడా అలవాటు పడుతున్నారని ఇది మంచి పరిణామమని అన్నారు. నగరవాసులకు కంచు పాత్రల్లో భోజనం పెట్టాలనే ఆలోచన కేటరర్స్ నిర్వాహకులకు రావడం అభినందనీయమని అన్నారు.

◆ ఈ సందర్భంగా నిర్వాహకులు గాండ్ల రమేష్‌కుమార్ మాట్లాడుతూ... దేశంలో ఇప్పటి వరకు ఒక్క కేరళ రాష్ట్రంలో మాత్రమే కంచు పాత్రల్లో కొన్ని చోట్ల వంటలు చేస్తున్నారని అన్నారు. కానీ తమ సంస్థ తొలిసారిగా తెలంగాణలో కంచు పాత్రల్లో వండే విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. త్వరలోనే నగర వ్యాప్తంగా మరిన్ని శాఖలు విస్తరించి ఈ విధానాన్ని అందరికీ పరిచయం చేస్తామని తెలిపారు.

◆ తొలుత 500 మందికి వంట చేసే వీలుగా తమిళనాడు నుంచి ప్రత్యేక కంచు పాత్రలను తయారు చేయించామన్నారు. అతి త్వరలోనే 5 వేల మందికి వండేలా మరిన్ని పాత్రలను తెప్పిస్తామని పేర్కొన్నారు. సాధారణ పాత్రల్లో వంట చేస్తే 20 శాతం కేలరీలు మాత్రమే ఉంటాయన్నారు. కంచు పాత్రల్లో వంట చేయడం వల్ల 90 శాతానికి పైగా కేలరీలు ఉంటాయని శాస్త్రీయంగా నిరూపితమైందని ఆయన తెలిపారు. బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, అర్కనపల్లి సూర్యరావు పాల్గొన్నారు.